క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి అలిపిరి: 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను టీటీడీ జేఏసీ నేతలతో కలిసి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం వారు ఎమ్మెల్యేని మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ద్వాదశి పూజలు



విశేష అలంకరణలో శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

పాకాల : స్థానిక ఊట్లవారిపల్లి సమీపంలోని శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చనలు, అభిషేకాలు చేపట్టిన అనంతరం ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు. అలాగే ఆలయంలో ప్రతి మంగళ, శుక్ర వారాల్లో అభిషేక పూజలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

తిరుచానూరు: తొందరగా వెళ్లాలనే ఆతృతలో రాంగ్‌రూట్‌లో వెళ్తే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని తిరుచానూరు సీఐ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన సిబ్బందితో కలిసి తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రగిరి–రేణిగుంట బైపాస్ రోడ్డులోని ఆర్సీపురం, తణపల్లి సర్కిల్ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాంగ్‌రూట్‌లో వస్తున్న ఒక ట్రాక్టర్, రెండు ఆటోలు, రెండు మోటార్ సైకిళ్లను పట్టుకుని వారిపై ఐపీసీ336 (డేంజరస్ డ్రైవింగ్) కింద వారిపై కేసు నమోదు చేసి, వాహన రికార్డులను, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించినట్లు తెలిపారు. అలాగే సరిగా రికార్డులు లేని వాహనదారులను కోర్టుకు పంపినట్లు చెప్పారు. వాహన యజమానులను పిలిపించి కౌన్సిలింగ్ కూడా ఇచ్చినట్లు తెలిపారు. ఇకపై రోజూ జాతీయ రహదారిలో స్పెషల్ డ్రైవ్ చేపడతామని, ఎవరైనా రోడ్డు నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జూనియర్ ఎన్టీఆర్‌తో కొత్త సినిమా



తిరుమల ఆలయం వెలుపల సినీ దర్శకుడు కొరటాల శివ, సినీ నటుడు శ్రీనివాసరెడ్డి

తిరుమల: జూనియర్ ఎన్టీఆర్‌తో కొత్త సినిమా తీస్తున్నామని సినీ దర్శకుడు కొరటాల శివ తెలిపారు. మంగళవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. జూనియర్ ఎన్టీఆర్‌తో తీస్తున్న సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమాను విడుదల చేస్తామన్నారు. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని స్వామివారిని ప్రార్థించానని తెలిపారు. ఆయన వెంట సినీ నటుడు శ్రీనివాస రెడ్డి ఉన్నారు.

సీఎం జగనన్న రుణం తీర్చుకుంటాం

- ఆయన అందించిన సంక్షేమ పథకాలే మా కుటుంబాలకు ఆసరా
- గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన ఎదుట లబ్ధిదారుల ఆనందం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: 'ఏమి తల్లీ జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా..! ఇన్ని పథకాలు గతంలో ఎప్పుడైనా అందాయా..!జగనన్న అధికారంలో ఉంటే భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారు' అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తిరుపతి 37వ డివిజన్ గిరిపురంలో మంగళవారం కార్పొరేటర్ బసవ గీత, ఆ డివిజన్ అధ్యక్షుడు కట్టా గోపీయాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పేదల సంక్షేమం కోసం అందించిన పథకాలను గడప గడపకు వెళ్లి వివరించారు.

మా పాలిట దేవుడు సీఎం జగన్..

ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే భూమనతో ప్రజలు మాట కలిపారు. తమ పాలిట దేవుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన అందించిన సంక్షేమ పథకాలే తమ కుటుంబాలకు ఆసరా అయ్యాయని గిరిపురం ప్రజలు ఎమ్మెల్యే ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. ఇంత మేలు చేసిన జగనన్న రుణం ఓటుతో తీర్చుకుంటామని వారు తేల్చి చెప్పారు. అనంతరం భూమన మాట్లాడుతూ జగనన్న అధికారంలో ఉంటే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారని, ఆయనను గెలిపించుకునే బాధ్యత మాత్రం మీదేనని అన్నారు. దేశ చరిత్రలోనే ఏ నాయకుడు ఇన్ని సంక్షేమ పథకాలు అందించిన దాఖలాలు లేవని, అది కేవలం జగనన్నకే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరసింహాచారి, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, పార్టీ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, బాలాజీ, బొమ్మగుంట రవి, కోదండ, కట్టా మోహన్, జయలక్ష్మి, మునిరాజ, ఎస్సీ కుమార్, భూపతి, కంకనాల రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను అధిగమించాలి

- కూలీల సంఖ్య పెంచాలి
- పనుల వద్ద వసతులు కల్పించండి
- ప్రతి పని వద్ద బోర్డు తప్పనిసరి
- డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్



మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్

భాకరాపేట : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను అధిగమించాలని తిరుపతి జిల్లా డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు మండల సామాజిక తనిఖీ బహిరంగ సభ ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి అధ్యక్షతన స్థానిక మండలకేంద్రంలో జరిగింది. మొదట 13 పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం చేపట్టిన తనిఖీ రిపోర్టు చదివి వినిపించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులకు సంబంధించి పని పేరుతో బోర్డులు పెట్టకపోవడంపై మండిపడ్డారు. 15 రోజుల్లో బోర్డులు ఏర్పాటు చేయకపోతే ఆ పనికి సంబంధించిన మొత్తం అమౌంట్‌ను సంబంధిత అధికారుల వద్ద నుంచి రికవరీ చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూలీల సంఖ్య పెంచడంతో పాటు పనులు వద్ద వసతులు కల్పించాలన్నారు. సభలో సీడీసీఎంఎస్ చైర్మన్ సామకోటి సహదేవరెడ్డి, ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి, డీపీవీఓ భాగ్యలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ కౌన్సిల్ మెంబర్ ముత్తుంశెట్టి విశ్వనాథ్, ఏపీడీ ప్రభావతి, అంబుడ్స్‌మెన్ రాచరాయుడు, బుజ్జి, సర్పంచ్‌లు, రైతులు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు ఎనలేనివి



ఎంపీ గురుమూర్తికి సావిత్రిబాయిపూలే చిత్రపటం బహూకరిస్తున్న ప్రొఫెసర్లు

తిరుచానూరు: జ్ఞాన సముపార్జన ద్వారానే మానవుడు ఉన్నత స్థితిని సాధిస్తాడన్న సావిత్రిబాయి పూలే సూక్తి ద్వారా మనమంతా ప్రేరణ పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. ఎస్వీయూలోని సెనేట్ హాల్‌లో జరిగిన ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. బాలికలకు పాఠశాలల్లో ప్రవేశం నిషిద్ధమని చెబుతున్న రోజుల్లోనే తన భర్త ప్రోద్బలంతో సావిత్రిబాయి పాఠశాలలో విద్యార్థిగా చేరారన్నారు. థామస్ క్లార్క్‌సన్ ఉద్యమ చరిత్రను చదివి తద్వారా స్ఫూర్తి పొందిన ఆమె మానవహక్కుల పోరాటయోధురాలిగా మారారన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు కూడా కృషి చేశారని చెప్పారు. ఆమె తన భర్త జ్యోతిబాపూలే మరణించిన సమయంలో ఆమె స్వయంగా చితిపెట్టి మరో విప్లవానికి తెరలేపారని చెప్పారు. నేడు మహిళా సాధికారత కోసం ఏ ప్రభుత్వాలు చేయనంతగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే రాజ్యాంగ, రాజకీయ పదవులలో కూడా మహిళలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. వీసీ వెంగమ్మ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ విద్యా పీఠం వీసీ వెంగమ్మ, విక్రమసింహపురి వీసీ కృష్ణమూర్తి, తుడా సెక్రటరీ సుందరవల్లి, టీటీడీ డీఈవో లక్ష్మమ్మ, అంబేడ్కర్ అధ్యయనకేంద్రం కన్వీనర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాకాల : భారతదేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, బాలికల పాఠశాలను స్థాపించిన మహోన్నతురాలు సావిత్రిబాయి పూలే అని పలువురు కొనియాడారు. మంగళవారం సావిత్రిబాయి పూలే 193వ జయంతిని మండలం కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అపంతనం సంఘం అధ్యక్షుడు పీఆర్ మునస్వామి మాట్లాతూ ఆమె సమాజానికి అందించిన సేవలు ఎనలేనివి అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

తిరుచానూరు: బడుగు, బలహీన వర్గాల ఆడపిల్లలకు వేగుచుక్క, భారత తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 192వ జయంతిని డీవైఎఫ్ఐ, ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తిరుచానూరు జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర, జిల్లా కార్యదర్శి సుమన్, హెచ్ఎం మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఐద్వా, డీవైఎఫ్ఐ నాయకులు

ఉపాధ్యాయులకు పూలే అవార్డు

రామచంద్రాపురం: మండలంలోని ఇద్దరు ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే ఎక్స్‌లెన్స్ అవార్డును మంగళవారం అందుకున్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన మహిళలకు తిరుపతి ఎన్జీఓ హోంలో సావిత్రిబాయి పూలే ఎక్స్‌లెన్స్ అవార్డులను అందజేశారు. ఇందులో ఎస్ఆర్ కమ్మపల్లి డీడబ్ల్యూ ప్రాథమిక పాఠశాల టీచర్ సుగుణ, రాయలచెరువు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సుమతీమణికి నిర్వాహకులు ఈ అవార్డులను అందించి ఘనంగా సన్మానించారు.



అవార్డులతో ఉపాధ్యాయులు సుగుణ, సుమతీమణి



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

వైభవం.. చక్రస్నానం



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు



తిరుచానూరు: వైకుంఠ ద్వాదశి పర్వదినం సందర్భంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరిగింది. మంగళవారం వేకువజామున అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని, చక్రాతాళ్వార్‌ను ఊరేగింపుగా తిరుచ్చిపై పుష్కరిణి వద్దకు తీసుకెళ్లి మండపంలో కొలువుదీర్చారు. మండపంలో అమ్మవారి ఉత్సవ మూర్తికి, చక్రతాళ్వార్‌కు వివిధ సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. అనంతరం చక్రతాళ్వార్‌ను పుష్కరిణిలో మూడుసార్లు ముంచి చక్రస్నానం ఘట్టాన్ని వేడుకగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, ఏవీఎస్వో శైలేంద్ర బాబు, ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణ వెంకన్న చక్రస్నానం



శ్రీనివాస మంగాపురంలో ...

చంద్రగిరి: తిరువేంకటాద్రి అయిన చక్రధారుడికి కనుల పండువగా మంగళవారం చక్రస్నానం నిర్వహించారు. శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చక్రస్నాన ఘట్టాని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి చక్రతాళ్వర్‌ను పుష్పపల్లకీపై ఆశీనులుచేసి ఆస్థానం నిర్వహించారు. తర్వాత స్నపన తిరుమంజన కార్యక్రమం, ఆలయ ఆవరణలోని పుష్కరిణిలో చక్రస్నాన ఘట్టాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చంద్రగిరి పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు తగిన ఏర్పాట్లను చేపట్టారు.

'యుగానికి ఒక్కడు సీఎం జగనన్న'




తిరుమలనగర్ వాసులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్న బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి

తిరుపతి మంగళం : 'సీఎం జగనన్న లాంటి గొప్ప నాయకుడు యుగానికి ఒక్కరు పుడతారు' అని మంగళంలోని తిరుమలనగర్ పంచాయతీ ప్రజలు అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రేషన్‌కార్డుదారులకు బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి, పంచాయతీ అధ్యక్షుడు గుండ్రాజు శివశంకర్‌రాజు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రజలు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో తమకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌ను రూ.2,750కు పెంచి ఇవ్వడంతో పాటు ఉచితంగా బియ్యం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి నాయకుడు కలకాలం ఉంటే తమకు ఎలాంటి కష్టాలు ఉండవని చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

తిరుమల: అనారోగ్యంతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. తిరుమల టూటౌన్ ఎస్ఐ మంజుల తెలిపిన వివరాల మేరకు.. తిరుమలలో నివాసం ఉంటున్న చిన్నబాబు అన్నదానసత్రంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య దుర్గ భవానీ(25), ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే దుర్గాభవానీ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లుగా మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తెప్పలపై సోమస్కంధుడు





తిరుపతి కల్చరల్: తిరుపతిలోని కపిలేశ్వరస్వామివారి ఆలయంలో జరుగుతున్న తెప్పోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం సాయంత్రం సోమస్కంధస్వామివారు తెప్పలపై భక్తులను కటాక్షించారు. విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించిన తెప్పపై సోమస్కంధస్వామివారు కపిలతీర్థం పుష్కరిణిలో ఐదు చుట్లు తిరిగారు. ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ పార్థసారథి, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

